సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 18 । డిసెంబర్ । 2022



వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు 8లో

జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి.



గిరిజనుల ఆరోగ్యానికి భరోసా

పాడేరు జిల్లా ఆస్పత్రి గిరిజనుల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు. 8లో



వణుకుతున్న మన్యం 8లో

జిల్లాలో చలిగాలులు వణికిస్తున్నాయి. మంచు దట్టంగా కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతల నమోదుతో చలితీవ్రత పెరిగింది.

న్యూస్‌రీల్

స్వీప్ నోడల్ అధికారిగా జేసీ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికల విభాగంలో స్వీప్ నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్‌ను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నోడల్ అధికారిగా అదనపు విధులు నిర్వహిస్తారు.

పరిశీలనకు ప్రత్యేక కమిటీ: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రత్యేక కమిటీని కలెక్టర్ సుమిత్‌కుమార్ నియమించారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, పాడేరు సబ్‌కలెక్టర్, డీఈవోను సభ్యులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, ఇతర అవకతవకలపై బూత్ స్థాయి అధికారి పరిశీలన చేసిన వాటిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోడి పందాలపై దాడి

వై.రామవరం: మండలంలోని గొడుగురాయి గ్రామ శివారులో కోడిపందాలు జరుగుతున్నాయన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. గొడుగురాయి గ్రామానికి చెందిన పాత్తూరి రాఘవరెడ్డి, చంద్రాస్ పాపి రెడ్డి, చోడి శివకృష్ణ పట్టుబడ్డారు. వీరి నుంచి 4 కోడికత్తులు, రూ.600 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సీలేరు: గిరి గ్రామాలభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గుమ్మిరేవుల పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి ఆయన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గుమ్మిరేవుల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలందున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలుకు అర్హతే కొలమానమన్నారు. అంతకుముందు గ్రామంలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1225 మంది లబ్ధిదారులు ఏటా రూ.4,87,79,596లు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముర్ల కమలమ్మ, ఉప సర్పంచ్ వెంకటరమణ, పార్టీ నాయకులు బొంజిబాబు, జర్రేల చిట్టిబాబు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి విద్యార్థుల తరలింపు



నూతన భవనంలోకి వచ్చిన విద్యార్థులు

రాజవొమ్మంగి : రాజవొమ్మంగిలో సుమారు రూ. 22 కోట్లతో 13 ఎకరాల విస్తీర్ణంలో సర్వాంగసుందరంగా రూపుదిద్దుకొన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలోకి శనివారం విద్యార్థులు చేరారు. ఈ పాఠశాలలను 4వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించడం తెలిసిందే. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు విద్యార్థులను తాళ్లపాలెంలోని తాత్కాలిక భవనం నుంచి రాజవొమ్మంగిలోని నూతనభవనంలోని తరలించామని ప్రిన్సిపాల్ ఎంవీ కృష్ణారావు తెలిపారు. ఈ పాఠశాలలో 240 మంది విద్యార్థులు చదువుతున్నారని ఆయన వివరించారు.

దయనీయం



సాక్షి,పాడేరు: సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో బంతిపూల ధర తగ్గిపోవడంతో గిరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో సీజన్ ప్రారంభం నుంచి దిగుబడి బాగుంది. ధర కూడా కలిసొచ్చింది. ఇప్పుడు ఒక్కసారిగా పడిపోయింది. సీజన్ ప్రారంభంలో బుట్ట బంతిపూలు రూ.200కు కొనుగోలు చేశారు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నం. పాతబస్టాండ్ మార్కెట్లో శనివారం బుట్ట బంతిపూలు రూ.30 నుంచి రూ.60కు కొనుగోలు చేయడంతో నిరాశకు గురయ్యారు.

మహోదయం



సాక్షి,పాడేరు: ప్రకృతి మలచిన పర్యాటక ప్రదేశాల్లో మన్యం ఎప్పుడూ ప్రత్యేకమే. మండు వేసవైనా.. చలి వణికించే శీతాకాలమైనా ఆ అనుభూతి వేరు.. గిరి గడ్డపై అడుగుపెడితే చాలు ఎక్కడలేని ఉల్లాసం పొంగుకొస్తుంది. అందుకేనేమో తీరిక దొరికినా.. వీకెండ్ అయినా ప్రకృతి ఒడిలో వాలిపోతున్నారు. సెలవు రోజులైతే పర్యాటకుల రాకతో మన్యంలోని రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. వంజంగి హిల్స్, భోనంగమ్మ పర్వతానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు.

పరవశం



దేవీపట్నం: పాపికొండలు విహారయాత్ర..జీవితంలో మరిచిపోలేని ప్రత్యేక అనుభూతి. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా నిలిచిపోయిన విహారం ఇప్పుడు ఊపందుకుంది. గోదావరి నదిపై అందాలను వీక్షించేందుకు ఎక్కడెక్కడి నుంచో తరలివస్తున్నారు. వీరికోసం ఏపీ టూరిజం స్పెషల్ ప్యాకేజీలు ప్రకటించింది. ఒకటి, రెండు రోజుల వ్యవధితో ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చింది. వీకెండ్ కావడంతో శనివారం పోశమ్మ గండి నుంచి మూడు ప్రైవేట్ టూరిజం బోట్లలో 232 మంది పాపికొండల అందాలను తిలకించేందుకు వెళ్లారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు

- సకాలంలో గర్భిణుల తరలింపు
- మాతాశిశు మరణాల నివారణకు చర్యలు
- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

జి.మాడుగుల: కాన్పునకు సిద్ధంగా ఉన్న గర్భిణులను గుర్తించి సకాలంలో ఆస్పత్రికి తరలించి సుఖ ప్రసవాలకు చర్యలు చేపట్టాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ సూచించారు. గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలో వరిగెలపాలెం గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇటీవల మరణించిన మగశిశువు తల్లిదండ్రులు మాతే సోములమ్మ, రవికుమార్, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. శిశువు మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. జి.మాడుగుల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మందులు, వైద్యుల వివరాలను తెలుసుకున్నారు. సుఖ ప్రసవాల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు గర్భిణులను తరలించేందుకు అవసరమైన సహకారాన్ని వైద్యాధికారులు, సిబ్బందికి ఎంపీడీవో సహకారం అందించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మాతృత్వవందన యోజన పథకం(పీఎంఎంవీవై) ద్వారా సహాయం అందించేందుకు గర్భిణుల పూర్తి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మాతాశిశు మరణాలను అరికట్టటానికి గ్రామస్థాయి ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. జ్వర పీడితుల రక్తపూతలు సేకరించి మలేరియా నిర్ధారణ అయిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రిలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా గుర్తించిన గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. మలేరియా,డయేరియా, డెంగ్యూ ఇతర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిని, సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్లు సోముదొర, రవిచంద్ర శేఖర్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, ఎంపీహెచ్‌ఈవో ఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.



వరిగెలపాలెంలో శిశువు మృతికి కారణాలను తెలుసుకుంటున్న పీవో గోపాలకృష్ణ

1262 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

దేవీపట్నం: జిల్లాలో పది రైతు భరోసా కేంద్రాల ద్వారా 1262 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఇందుకూరిపేటలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రూ.2.5 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.72 లక్షలు వారి ఖాతాల్లో జమచేసినట్టు చెప్పారు. అనంతరం ఆయన దేవారం, శరభవరం గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూహక్కు, భూరక్ష పథకంలో సర్వే చేసిన భూములన్నింటికీ రైతు హక్కుపత్రాలు అందిస్తామని జేసీ చెప్పారు. సర్వే సమయంలో రైతులకు హద్దులు చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం గణేష్, శ్రీహరి, ఎంఎఓ జెన్నీ, మండల సర్వేయర్ కుమారి, సొసైటీ సీఈవో పాపారావు తదితరులు పాల్గొన్నారు.



కల్లాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

వంద కిలోల రేషన్ కందిపప్పు పట్టివేత

జీసీసీ గోదాంకు అప్పగింత

ముంచంగిపుట్టు: ప్రభుత్వం పౌర సరఫరా సంస్థ పేరుతో ఉన్న వంద కిలోల కందిపప్పును శనివారం స్థానిక గిరిజనులు పట్టుకున్నారు. వీటిని మండల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు అప్పగించారు. పౌర సరఫరా సంస్థ పేరుతో ఉన్న 100 ప్యాకెట్ల కందిపప్పుతో శనివారం ప్రైవేట్ జీపు ముంచంగిపుట్టులో బయలుదేరింది. డీజిల్ నిమిత్తం పెట్రోల్ బంకు వద్ద ఆగింది. జీపులో ప్రభుత్వం సరఫరా చేసే కందిపప్పు ప్యాకెట్లను జర్జుల పంచాయితీ గుర్రాలబైలు గ్రామస్తులు బి.రామచందర్, కె.ఉద్రరావు, బి.జగన్నాథం పట్టుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని వినియోగదారుల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.ప్రసన్నకుమార్‌కు తెలియజేశారు. అతని సహకారంతో తహసీల్దార్ నర్సమ్మకు అప్పగించారు. కందిపప్పును పక్కదారి పట్టిస్తున్న జోలాపుట్టు వ్యాపారి పి.శంకరరావును సైతం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక జీసీసీ గోదాం ఇన్‌చార్జి కుమార్‌స్వామికి ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో రమేష్, గుర్రాలబైలు గ్రామ గిరిజనులు కందిపప్పును అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు.



పట్టుకున్న రేషన్ కంది పప్పు ప్యాకెట్లు



జీసీసీ గోదాంకు అప్పగిస్తున్న గిరిజనులు

లాఠీ పట్టిన ధర్మశ్రీ

సాక్షి, పాడేరు: కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్ కదా లాఠీ పట్టడమేమిటని ఆలోచిస్తున్నారా.. ఆయన ఓ సినిమాలో కానిస్టేబుల్ పాత్రలో నటిస్తున్నారు. సహజంగా కళాకారుడైన ధర్మశ్రీ నాటకాలు, సినిమాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఆయన తాజాగా అనకాపల్లి జిల్లాకు చెందిన గవిరెడ్డి శ్రీనివాస్ దర్శకత్వంలో ఒంటోలి పతాకంపై నిర్మిస్తున్న సినిమాలో పోలీసు కానిస్టేబుల్ పాత్ర ధరిస్తున్నారు. శనివారం పెదబయలు మండలం అరడకోట ప్రాంతంలో సన్నివేశాలను చిత్రీకరించారు. పెదబయలు–పాడేరు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులో అరడకోట శివాలయానికి సమీపంలో చెక్‌పోస్టు సెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ చిత్రీకరించిన సన్నివేశాల్లో ధర్మశ్రీ నటించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ కూడా కానిస్టేబుల్ పాత్రలో నటిస్తున్నారు. ధర్మశ్రీతో పాటు ఆయన షూటింగ్‌లో పాల్గొన్నారు.



పోలీసు వేషధారణలో ధర్మశ్రీ

రూ.16 కోట్లతో ఏకలవ్య పాఠశాల పనులు



పనులు పరిశీలిస్తున్న ఏఈ ఆదినారాయణ

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో రూ.16 కోట్లతో రెండవ దఫా పనులు జరుగుతున్నాయని సీపీడబ్ల్యూడీ ఏఈ ఎస్.ఆదినారాయణ తెలిపారు. శనివారం ఆయన పాఠశాల ఆవరణలో జరుగుతున్న కాంక్రీట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర, బాలికల వసతి గృహ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ క్వార్టర్‌తోపాటు సిబ్బంది కోసం మూడు బ్లాకుల్లో 27 క్వార్టర్లు నిర్మిస్తున్నామన్నారు. అయితే స్థల వివాదం కారణంగా ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలవలేదన్నారు.సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మాణానికి దాదాపుగా రూ.3 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశామని ఆయన తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈ అదృశ్యం

చింతూరు: కూనవరం విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న ఆదావత్ హుస్సేన్ ఈనెల 13 నుంచి అదృశ్యమైనట్టు ఆయన భార్య స్రవంతి శనివారం చింతూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతూరులో ఈనెల 13 రాజోలు బస్సు ఎక్కిన ఆయన కాకినాడ ఇంటికి చేరాల్సి ఉండగా, అప్పటి నుంచి అతని ఆచూకీ లేదని, సెల్ స్విచ్ఆఫ్ వస్తుందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యానికి భరోసా

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : పాడేరు జిల్లా ఆస్పత్రి గిరిజనుల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు. ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఈ ఏడాదిలో 1522 శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించడంపై వైద్య బృందం, సిబ్బందిని అభినందించారు. ఏజెన్సీ నుంచి విశాఖ కేజీహెచ్‌కు వెళ్లకుండా అన్ని రకాల శస్త్ర చికిత్సలు స్థానిక ఆస్పత్రిలోనే నిర్వహిస్తుండపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. పాడేరు జిల్లా ఆస్పత్రికి వెళ్తే ఆరోగ్యం మెరుగుపడుతుందనే నమ్మకం పెంచాలన్నారు.

కేజీహెచ్‌లో మాదిరిగానే స్థానికంగా కూడా అన్ని రకాల వైద్య చికిత్సలు కల్పించాలని సూచించారు. ఆస్పత్రిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఐటీడీఏ సిద్ధంగా ఉందన్నారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి రూ.2.94కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం

స్థానిక జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి తాము రూ.2.94కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారన్నారు. ఆయా నిధులతో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గిరిజనుల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండకూడదని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఏజెన్సీలో వైద్య పరంగా ముందడుగు చేస్తున్నామని చెప్పారు. జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఆపరేషన్లపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సలపై వైద్య నిపుణులు రవికిరణ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ రూ.29.35లక్షలు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, సీనియర్ వైద్యులు డాక్టర్ కృష్ణారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



గాయపడిన యువకుడికి 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని అరుకు–పాడేరు ప్రధాన రహదారి కొట్నాపల్లి వద్ద పాతకోట, రణంకోట గ్రామాల నుంచి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. ప్రమాదంలో పాతకోట గ్రామానికి చెందిన బి.సింహాచలం, కాంతమ్మ..రణంకోట గ్రామానికి చెందిన వంతాల సన్యాసి, జ్యోతి, లక్ష్మిలకు గాయాలయ్యాయి. అదే సమయంలో అరుకు నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాన్ని గుర్తించి డ్రైవర్ వాహనాన్ని చాకచక్యంగా నిలుపుదల చేశారని లేకుంటే భారీ ప్రమాదం జరిగేదని తోటి ప్రయాణికులు పేర్కొన్నారు. స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాడేరు రూరల్ : మండలంలోని వంజంగి ఘాట్ రోడ్డు ద్విచక్ర వాహనం బ్రేకులు ఫెయిలై అదుపు తప్పి పడిపోవడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులు వంజంగి మేఘాల కొండను తిలకించి ద్విచక్రవాహనంపై పాడేరు వస్తుండగా వంజంగి ఘాట్‌లో బ్రేకులు ఫెయిల్ కావడంతో ఓ లోయలోకి దూసుకుపోయారు. ఈ ప్రమాదంలో విశాఖపట్నానికి చెందిన పొన్నాడ మన్మథరావు అనే యువకుడి కుడి చేయి విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన యువకుడికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు కల్పించారు.

గురుకుల విద్యార్థి మృతదేహంతో ఆందోళన

● న్యాయం చేయాలని డిమాండ్
● అధికారుల హామీతో ఆందోళన విరమణ

పాడేరు రూరల్ : సహచర విద్యార్థుల దాడిలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో వైద్యం పొందుతూ ప్రాణాలు విడిచిన విద్యార్థి జర్త కొండబాబు మృతదేహంతో శనివారం రాత్రి కందమామిడి జంక్షన్ వద్ద, ఐటీడీఏ ఎదుట కుటుంబ సభ్యులు, పలు సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. విద్యార్థి జర్తా కొండబాబు కుటుంబలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఈ ఘటనలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్. రజని వారితో మాట్లాడారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, తక్షణ సహాయం కింద రూ.లక్ష ఇస్తామని, మరో రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని లిఖిత పూర్వక హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. దీంతో విద్యార్థి మృతదేహం స్వగ్రామమైన మల్లెపుట్టు గ్రామానికి తరలించారు. ఆందోళనలో గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఉద్యోగ సాధన సమితి అధ్యక్షుడు వై.కుమార్ పాల్గొన్నారు.

పలువురిపై కేసు?

జి.మాడుగుల: స్థానిక గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి మృతిపై పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసినట్టు తెలిసింది. జి.మాడుగుల గురుకుల యాజమాన్యం నిర్లక్ష్యం, తోటి విద్యార్థులు దాడి చేయడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొండబాబు మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొండబాబుపై దాడి చేసిన విద్యార్థులు, యాజమాన్యంపైన వివిధ సెక్షన్ల కింద కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్టు సమాచారం. ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తున్నట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.



ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, పలు సంఘాల నాయకులు

వణుకుతున్న మన్యం

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు వణికిస్తున్నాయి. మరోపక్క మంచు దట్టంగా కురుస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదుతో చలితీవ్రత పెరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. మన్యం ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 14,అరకులోయలో 15, చింతపల్లిలో 18 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంచు దుప్పటి

పెదబయలు: మండలంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుతున్నాయి. శనివారం ఉదయం 9.30 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చలితీవ్రత కూడా ఎక్కువగానే ఉంది.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.